క్లుప్తంగా

ఎంపీకి ఆహ్వానం


ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గురుపీఠం సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లో నిర్మించిన గురుపీఠంలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు ప్రతిష్ఠించనున్న దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని గురువారం పలువురికి గురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆహ్వాన పత్రికలు అందజేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతియాదవ్, తదితరులు ఉన్నారు.

తిరంగా ర్యాలీ..


తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతం కావడంతో సైనికులకు మద్దతుగా పెద్దశంకరంపేటలో గురువారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు జాతీయ జెండాలతో నాయకులు, గ్రామస్తులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జంగం శ్రీనివాస్, విఠల్, నారాగౌడ్, సత్యనారాయణ, రాజన్‌గౌడ్, సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, శ్రావన్, సీతారం, ఎర్ర శ్రీహరి, రవీందర్, జైహింద్‌రెడ్డి, శివశంకర్, మధు, సర్వేశ్వర్, కృష్ణ తదితరులున్నారు.

ప్రైవేట్ మోటర్‌ను తొలగించాలి

ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ బోరులో ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను తొలగించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌కు మహమ్మద్‌నగర్ గ్రామస్తులు రఘు, బాలాగౌడ్, క్రిష్ణ, సత్యాగౌడ్, పాపయ్య తదితరులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బురిగారి వెంకన్న గ్రామ పంచాయతీ బోర్‌బావిలో మోటర్ ఏర్పాటు చేసి నూతన ఇంటి నిర్మాణానికి నీటిని వాడుకుంటున్నాడని ఆరోపించారు. దీంతోపాటు మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ నుంచి నల్లా కనెక్షన్ తీసుకోవడం వల్ల ఇతరులకు నీళ్లు రావడం లేదన్నారు. అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పంచాయతీ బోరునుంచి మోటర్‌ను తొలగించడంతో పాటు నల్లా కనెక్షన్‌ను తొలగించాలని కోరారు. కాగా పరిశీలించి చర్య తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పల్లకి సేవ


హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని జల హనుమాన్ ఆలయం వద్ద భక్తి భజనల మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ ఇతర భక్తుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ చేపట్టారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ గురుస్వాములు యాదా గౌడ్, ప్రభు గౌడ్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య ఎన్నిక

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండల సమాఖ్య ఎన్నికలు గురువారం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ మండల అధ్యక్షురాలిగా సువ్వా జ్యోతి, కార్యదర్శిగా కుమ్మరి మల్లేశ్వరి, కోశాధికారిగా బేరి లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఐకేపీ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.


పోచమ్మ కాలనీలో మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కాలనీవాసి


మురుగు వ్యర్థాలను తరలిస్తున్న కాలనీవాసులు

'మురుగు'తో అవస్థలు

- పట్టించుకోని అధికారులు
- స్వచ్ఛందంగా శుభ్రం చేసిన కాలనీవాసులు

రేగోడ్(మెదక్): ప్రజలకు జవాబుదారిగా ఉంటూ ప్రజాపాలన అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటమే గాకుండా ప్రభుత్వం అప్రతిష్టపాలవుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలే.. స్వచ్ఛందంగా తమ ఇళ్ల ముందు ఉన్న మురుగు కాలువలను శుభ్రం చేసుకున్న ఘటన గురువారం రేగోడ్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది.

మండల కేంద్రమైన రేగోడ్‌లోని పోచమ్మ కాలనీలో కొన్ని రోజులుగా మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలు పడుతుండటంతో కాలువల్లోని మురుగు బయట పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్గంధంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్వచ్ఛందంగా కాలనీవాసులే కాలువలోనుంచి మురుగును బయటకు తోడి శుభ్రం చేసుకున్నారు. మూడు నెలల నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పరిశుభ్రతపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్మికుడి ఇంట్లో పెళ్లి ఉండటం వల్ల ఆలస్యమైదని తెలిపారు. పరిశుభ్రత కోసం తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

మెదక్ ఆర్డీఓ రమాదేవి


గడిపెద్దాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రమాదేవి

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం, రైస్‌మిల్లును ఆమె తనిఖీ చేశారు. వర్షం పడటంతో మ్యాచర్ రాక ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు ఆర్డీఓకు చెప్పారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తామని , ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఏపీఎం నాగరాజు, ఆర్‌ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో గోల్‌మాల్


గ్రామంలో విచారణ చేస్తున్న డీపీఎం మోహన్

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంలో గోల్‌మాల్ జరిగిన ఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి ఐకేపీ సెంటర్‌లో చోటుచేసుకుంది. ధాన్యం తూకంలో తేడా రావడంతో రైతులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. సెంటర్ ఇన్‌చార్జి చంద్రకళ అవకతవకలకు పాల్పడిందని రైతులు సురేష్, మహేష్, శ్రీనివాస్, ఖాదర్‌పాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేష్ తదితరులు ఆరోపించారు. ట్రక్ షీట్ వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ గురువారం గ్రామంలో రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. తూకంలో అవకతవకలు జరిగిన విషయం గుర్తించి రైతులకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ గణేష్‌రెడ్డి, సిబ్బంది

తూప్రాన్: దళిత బాల బాలికల అభ్యున్నతి, విద్య కోసం కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘసంస్కర్త అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఆయన జయంతిని తూప్రాన్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వివిధ సంఘాల ద్వారా అంటరాని కులాల వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామివారికి పూజలు చేశారు.భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.


శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు


మెదక్ మున్సిపాలిటీ: పంచముఖి హనుమాన్ ఆలయంలో..

26న గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈ నెల 26న మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల కళాశాలలో ఖాళీసీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫణికుమార్ గురువారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ విద్యార్థులు 26న ఉదయం 10గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నర్సాపూర్ మండలంలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్‌లోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలితాదేవి, కోఆర్డినేటర్ గంగారాం నాయక్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు 26న నిర్వహించే కౌన్సెలింగ్‌కు బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

ఇసుక అక్రమ డంప్ సీజ్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బొగుడభూపతిపూర్ శివారులో 20 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక అక్రమ డంప్ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ సింధూరేణుక తెలిపారు. ఈ ఇసుకకు 27న వేలం పాట నిర్వహించనున్నట్లు, రూ.10వేల డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

యూనిక్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలి


రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి రైతు యూనిక్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గౌతాపూర్, అజ్జమర్రి గ్రామాల్లో యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధార్ ఉన్నట్టే, భూమి ఉన్న ప్రతి రైతుకు 11 నంబర్ల విశిష్ట సంఖ్య అవసరమన్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టిందని తెలిపారు. భూ యజమాని ఆధార్‌కార్డు అనుసంధానం చేయడంతో రైతు విశిష్ట సంఖ్యను కేటాయిస్తారని చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు, భూయజమాని పట్టా పాస్ బుక్కు, ఆధార్‌తో లింక్ ఉన్న నంబర్ గల ఫోన్ తీసుకుని వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణవేణి, అనిత, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హనుమాన్ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెడ్డి కాలనీలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం సప్తమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, గౌరి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పుణ్యాహవాచనం, మండపారాధన, కలశస్థాపన, హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రపు కొండల్‌రెడ్డి ఇమ్మడి శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వర్షంతో రైతులకు తప్పని పాట్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో కురిసిన అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిసి ముద్దవడంతో పాటు రామాయపల్లిలో ఓ నివాస గృహం పాక్షికంగా కూలిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం కురిసిన వర్షానికి గ్రామానికి వెంకటోళ్ళ బాలేష్‌గౌడ్ ఇంటి స్లాబు ముందు భాగం కూలిపోయింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ కూలిన గృహాన్ని పరిశీలించి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దండుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యంతోపాటు, బస్తాల్లో నింపిన ధాన్యం తడిసినట్లు రైతులు పేర్కొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సుశీల, రవీందర్ నాయక్, అమీర్ పాషా, ఆపిపా జహాన్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని దాని ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏఈఓలు రవివర్మ, లక్ష్మి, ఆత్మా కమిటీ ఏటీఎం హరీష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన


మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి

తూప్రాన్: మున్సిపల్ ఆధ్వర్యంలో అమృత్ మిత్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం గురువారం చెరువు కట్టపై మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతూ కార్యక్రమం ఉద్దేశం మహిళల ద్వారా మొక్కలు నాటించడం, సంరక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఓ ఆసియా, ఆర్‌పీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొంటాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- రామాయంపేట తహసీల్దార్ రజినికుమారి


చిన్నశంకరంపేటలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్


రామాయంపేట: మార్కెట్ కమిటీలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రజినికుమారి

రామాయంపేట(మెదక్): తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే రైస్‌మిల్లులకు పంపిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ రజిని కుమారి అన్నారు. మండలంలోని వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని గురువారం పరిశీలించి ఆమె రైతులతో మాట్లాడారు. సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ తడిసిన ధాన్యం వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు మండలవ్యాప్తంగా రెండు లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ధాన్యానికి టార్పాలిన్లు కప్పి వర్షాల భారీనుంచి కాపాడుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐలు, ఇతర అధికారులున్నారు.

వెనువెంటనే తరలిస్తాం..

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటవెంటనే ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం, జొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయా రైస్‌మిల్లర్లకు ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈఓ రవీందర్ తదితరులున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యంను మండల తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. గురువారం చిన్నశంకరంపేట, అంబాజిపేట, ఎస్.కొండాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యంతో పాటు బస్తాలు తడిసినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

మొలకెత్తిన ధాన్యం..

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొలకెత్తింది. కొనుగోలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చెక్కులు పంపిణీ

టేక్మాల్(మెదక్): సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నిరుపేదలకు వరమని మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ అన్నారు. మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు మండలానికి మంజూరైన రూ.5,30,500 విలువైన చెక్కులను 16 మంది లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు షేక్ మజర్, పట్టణ అధ్యక్షుడు కిశోర్, సీనియర్ నాయకులు పాపయ్య, అశిలి సాగర్, వెంకట్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేగోడ్ మండలంలో..

రేగోడ్(మెదక్): మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రూ.1లక్షా 57వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, నాయకులు అంజయ్య, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

◆ బీజేపీ మండల సమావేశం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో పుణ్యశ్లోక లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా టేక్మాల్‌లోని పోచమ్మ దేవాలయంలో గురువారం బీజేపీ వర్క్‌షాపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ సిద్ధిరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, జిల్లా యువమోర్చా జనరల్ సెక్రటరీ మదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, జనరల్ సెక్రటరీ సేనాపతి,సెక్రటరీ శేఖర్, నాయకులు అశోక్, రాములు, శ్రీకాంత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ మహిళ అదృశ్యం

నర్సాపూర్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన నర్సాపూర్ పట్టణంలోని చైతన్యపురి కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... చైతన్యపురి కాలనీకి చెందిన వడ్ల ఈశ్వరమ్మ (45)కు ఈనెల 18న ఇంటిపక్క వారితో గొడవ జరిగింది. దీంతో ఆమె మనస్తాపానికి గురై 19న మధ్యాహ్నం సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ పోక్సో చట్టంపై అవగాహన

మెదక్‌జోన్ : విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది, పోలీస్‌శాఖ లీగల్ అడ్వైజర్ శ్వేత పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న మూడవరోజు శిక్షణ శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టం గురించి తెలుసుకుని విద్యార్థులకు బోధిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కో–ఆర్డినేటర్ రేఖ, రిసోర్స్ పర్సన్‌లు మహేందర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

◆ పిడుగుపాటుకు ట్యాంక్ పైకప్పు ధ్వంసం

చేగుంట (తూప్రాన్): పిడుగుపాటుకు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు పైకప్పు ధ్వంసమైంది. ఈ ఘటన మండలంలోని గొల్లపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఉరుములతో కూడిన గాలివాన రావడంతో గ్రామ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు సమీపంలో పిడుగు పడింది. దీంతో ట్యాంకు పైకప్పు ధ్వంసమైనట్లు గుర్తించిన వాటర్‌మెన్ అధికారులకు సమాచారమిచ్చారు.

◆ కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ



తూప్రాన్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తూప్రాన్ మాజీ జెడ్పీటీసీ రాణి సత్యనారాయణగౌడ్ గురువారం మార్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులను సిద్ధం చేయాలని కేటీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఉన్నారు.